దిల్‌సుఖ్‌నగర్ నుంచి పటాన్‌చెరుకు

ఏసీ మెట్రోలగ్జరీ బస్సులు

- 22 నిమిషాలకు ఓ బస్సు
- గురువారం నుంచి సర్వీసులు ప్రారంభం



హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ప్రయాణికులకు మెరుగైన సేవలందించే దిశగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఉదయం నుంచి 217 డి రూట్(పటాన్‌చెరు నుంచి దిల్‌సుఖ్‌నగర్)లో 10 ఎలక్ట్రిక్ ఏసీ మెట్రోలగ్జరీ బస్సులు నడుపుతున్నట్లు మంగళవారం వెల్లడించారు. మియాపూర్-2 డిపో నుంచి 217 డి రూట్‌లో ప్రతీ 22 నిమిషాలకు ఒక ఏసీ మెట్రోలగ్జరీ బస్సు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. పటాన్‌చెరు నుంచి వయా లింగంపల్లి, గచ్చిబౌలి, మెహిదీపట్నం, లక్డీకాపూల్, ఆబిడ్స్, గ్రామర్ స్కూల్, కోఠి, మలక్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు ఏసీ బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బస్సుల సమయం..

- పటాన్‌చెరు, లింగంపల్లి నుంచి మొదటి బస్సు ఉదయం 5 గంటలకు, చివరి బస్సు రాత్రి 10.03నిమిషాలకు.
- దిల్‌సుఖ్‌నగర్ నుంచి మొదటి బస్సు ఉ. 6.40 నిమిషాలకు, చివరి బస్సు రాత్రి 11.53 నిమిషాలకు.

నష్టాన్ని తగ్గించిన ఆర్టీసీ కార్మికులు

దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ హరి



ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ హరి

చాదర్‌ఘాట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నెల వచ్చే రూ.3.50 కోట్ల నష్టాన్ని రూ.1.20 కోట్లకు కార్మికులు తగ్గించారని ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ హరి తెలిపారు. డిపో రోజు వారీ కలెక్షన్‌ను రూ.12 లక్షల నుంచి రూ.23 లక్షలకు పెంచామని, ఇది కార్మికులందరి సమష్టి కృషితోనే సాధ్యమైందని డీఎం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో డిపో మేనేజర్ హరి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్మికులు డీఎంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ వెంకన్న, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏఎంటీ ఫైనాన్స్ లింగయ్య, ఎంఎఫ్ వెంకటేశ్, వెల్ఫేర్ బోర్డు సభ్యులు జీఎస్‌రెడ్డి, ఎంవీఎస్ రావు, మోహన్, పీఎస్‌రావు, రాజు, రామకృష్ణ, వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిధానీ ఆర్టీసీ డీఎంగా విజయ్‌కుమార్



చంపాపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్‌లోని మిధానీ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. జీడిమెట్ల డిపో నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు విచ్చేశారు. మిధానీ డిపోలో పనిచేసిన డీఎం ఆంజనేయులు బదిలీపై జీడిమెట్ల డిపోకు వెళ్లారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

బోనాల ఉత్సవాలకు ఆహ్వానం

సైదాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): శ్రద్దాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైదాబాద్‌లో ఈ నెల 28న బోనాలు, 29న ఘటాల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డికి మంగళవారం ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ సుభాష్ చందర్జీ, ఉపాధ్యక్షుడు సంగోది పరమేష్ కుమార్ పాల్గొన్నారు.

జలమండలి మలక్‌పేట డివిజన్-2 డీజీఎం బదిలీ

చాదర్‌ఘాట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జలమండలి మలక్‌పేట డివిజన్-2 డీజీఎం షీలారాణి బంజారాహిల్స్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఈమె స్థానంలో జలమండలి ప్రాజెక్ట్ వర్క్స్ డీజీఎంగా విధులు నిర్వహిస్తున్న అభిలాష్ వచ్చారు. మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. అలాగే, మలక్‌పేట సెక్షన్ మేనేజర్‌గా ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న హష్మత్‌అలీ జలమండలి ప్రాజెక్ట్ విభాగానికి బదిలీ కాగా, ఈయన స్థానంలో శంకర్ బాధ్యతలు స్వీకరించారు. ముసారాంబాగ్ సెక్షన్ మేనేజర్ చందూనాయక్ మెహిదీపట్నం కాకతీయనగర్ సెక్షన్ మేనేజర్‌గా బదిలీ కాగా, ఆయన స్థానంలో వెంకటేశ్ బాధ్యతలు చేపట్టారు.

వీధి కుక్కల నియంత్రణకు రెండు షెల్టర్లు

- బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలకు స్టెరిలైజ్ చేసి తిరిగి రోడ్లపై వదిలేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, వాటి నియంత్రణ కోసం ప్రత్యేకంగా షెల్టర్లు(కేజ్‌లు) ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అభిప్రాయపడ్డారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని రెండు ప్రాంతాల్లో షెల్టర్లు నిర్మించి, వీధి కుక్కలను అందులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ప్రజలపైనా దోమల నివారణ బాధ్యత

- కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్



తొట్టిలో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్

ఎల్‌బీనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణ బాధ్యత కేవలం జీహెచ్ఎంసీ సిబ్బందిపైనే కాకుండా ప్రజలపై కూడా ఉన్నదని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ అన్నారు. మంగళవారం సరూర్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరు ఎక్కువగా నిల్వ ఉన్న ప్రాంతాలను జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలకు సూచించారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ను కోరారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో కార్పొరేటర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

సింగరేణి వాంబేకాలనీలో కలుషితనీటి సరఫరా

- వైశాలీనగర్ జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా
- అధికారులతో వాగ్వాదం



కలుషితనీటి బాటిళ్లతో వాంబేకాలనీవాసుల ధర్నా



జలమండలి అధికారిని నిలదీస్తున్న బాధితులు

సైదాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వాంబేకాలనీలో ఆరు నెలలుగా తరుచూ నల్లాల ద్వారా కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. నల్లా ద్వారా రంగు మారిన మంచినీళ్లు, దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోగాల బారిన పడుతున్నారు. ఈ సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలుషితనీటి సరఫరాకు డ్రైనేజీల లీకేజీలే కారణమని వారు ఆరోపిస్తున్నారు.

కలుషిత నీటి బాటిళ్లతో ఆందోళన

నల్లాలో వచ్చిన కలుషిత నీటిని బాటిళ్లలో తెచ్చి వైశాలీనగర్ జలమండలి కార్యాలయం ఎదుట మంగళవారం వాంబే కాలనీవాసులు ధర్నా చేశారు. అధికారులు సముదాయించేందుకు యత్నించగా వాగ్వాదం చేశారు. కలుషితాన్ని అరికట్టే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.



ప్రభుత్వ భూమిలో వెలసిన షెడ్డును తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రభుత్వ స్థలంలో షెడ్డు కూల్చివేత

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్‌లోని ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ షెడ్డును మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ అధికారులు తొలగించారు. పెద్దఅంబర్‌పేట్ సర్వేనంబర్ 244/34లోని ప్రభుత్వ భూమిలో ఇటీవల ఓ షెడ్డును నిర్మించారు. దీనిపై కొందరు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో అధికారులు ప్రభుత్వ స్థలంలోని షెడ్డును తొలగించారు. ప్రభుత్వ భూమిని అక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

'బీజేపీ నేతలపై బీఆర్ఎస్ కార్యకర్తల దాడులు అమానుషం'

సరూర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 29వ డివిజన్‌కు చెందిన బీజేపీ నేత మహేందర్‌పై దాడి చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ డిమాండ్ చేశారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఆదివారం బోనాల పండుగ గురించి మాట్లాడుదామంటూ కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు మహేందర్‌ను పిలిచి, అకారణంగా దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై బాధితుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా

- దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ వీరయ్య



దివ్యాంగ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

ఓల్డ్ మలక్‌పేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. మంగళవారం మలక్‌పేటలోని దివ్యాంగుల కార్యాలయంలో వివిధ జిల్లాల యూనిట్లలో పనిచేస్తున్న ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజా, జనరల్ మేనేజర్ ప్రభంజన్‌రావు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పలకలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న నర్సింహారెడ్డి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల

వనస్థలిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకెళ్లాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మన్సూరాబాద్ చౌరస్తాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ హయత్‌నగర్ ఆధ్వర్యంలో ఉచితగా నోట్‌పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బృందావన్‌కాలనీ, ఎస్ఆర్ఎల్‌కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ పవన్‌కుమార్



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బృందావన్‌కాలనీ, ఎస్ఆర్ఎల్‌కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. కాలనీల్లో బాక్స్ డ్రెయిన్ పనులతో పాడైన రహదారుల మరమ్మతు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ మాతృనాయక్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎంటమాలజీ అధికారుల సూచనలు పాటించాలి

దోమల నివారణకు ఎంటమాలజీ అధికారుల సూచనలు పాటించాలని కార్పొరేటర్ పవన్ కుమార్ సూచించారు. మంగళవారం కామినేని చౌరస్తా వద్ద శివగంగ కాలనీలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది దోమల వల్ల వచ్చే డెంగీ, చికున్‌గున్యా, మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంటమాలజీ విభాగం ఏఈ రాంబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు ఉన్న స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగం ఏఈ రాంబాబు, సిబ్బంది వెంకటేశ్వర్లు, అఖిల్, కాలనీనాయకులు లక్ష్మీపతిగౌడ్, సుబ్బారావు, వెంకటరాయుడు, శ్రీనివాస్‌గౌడ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

పేదలకు ఆసరా సీఎంఆర్ఎఫ్ : దరిపల్లి

ఎల్‌బీనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు ఆసరా అని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్‌కు చెందిన వీరబొమ్మ ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.56 వేల చెక్కును ప్రభాకర్ తనయుడు శ్రీనివాస్‌కు రాజశేఖర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ నాయకులు రోహిత్, భాస్కర్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

తెలంగాణ న్యాయవాదుల సహకార సంఘం డైరెక్టర్‌గా ఉదయగిరి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ న్యాయవాదుల సహకార సంఘం డైరెక్టర్‌గా రంగారెడ్డి జిల్లాకు చెందిన న్యాయవాది ఉదయగిరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్‌లో రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదులు ఉదయగిరికి మంగళవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణ, శ్రీనాథ్, మీనాక్షి, నర్సింహ, విప్లవరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



విద్యార్థులతో బీఓబీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు

విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి

కొత్తపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికతో చదువుతూ లక్ష్యాలను సాధించాలని బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శైలేంద్ర సూచించారు. బీఓబీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం సంఘం ప్రతినిధులు మోహన్‌నగర్ మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగ్‌లు, పాఠశాలకు మైక్‌సెట్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఆనంద్‌కుమార్, మేనేజర్ రామారావు, యోగా టీచర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు శోభారాణి, సునీత, అరుణ జ్యోతి, మోహన్‌నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదిరె కృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోండి



కదిరె కృష్ణపై మీర్‌పేట్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న తిరుపతిరెడ్డి తదితరులు

సరూర్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాది కదిరె కృష్ణపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హిందూ ఉత్సవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, భజరంగ్ దళ్ నాయకుడు కాశీరామ్‌యాదవ్ పోలీసులను కోరారు. మంగళవారం వారు కృష్ణపై మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాది కృష్ణ ఇటీవల వెంకటేశ్వరస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని, తన వ్యక్తిగత ఇమేజ్ పెంచుకోవడానికి ఇతర మతాల దేవుళ్లను అవమానించడం తగదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు మన్యం రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్యాంసుందర్‌రావు, రాఘవేందర్‌గౌడ్, చైతన్య, రాజేశ్, అనుదీప్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

సంతోష్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 9వ తేదీన ఉదయం 11 గంటల ప్రాంతంలో చంపాపేటలోని రాఘవేంద్ర వైన్స్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై సుమారు 35 సంవత్సరాల వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యాపారి..

బర్కత్‌పుర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడలో నివసిస్తున్న శంకర్ (64) వ్యాపారి. మంగళవారం ఉప్పుగూడ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పదవతరగతి పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చంపాపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని శ్రీ త్రివేణి పాఠశాలలో 1999 బ్యాచ్‌కి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్కూల్ చైర్మన్ జిట్ట సురేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు కౌసల్య, విశ్వరూపం, సుధాకర్, ఈశ్వర్, వాచేస్పతి, భిక్షపతి, రవీందర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జగదీష్, ప్రవీణ్, శరత్, జ్యోతి, అలివేలు, సతీష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడో జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ విజేత శ్రీరామ్



పతకాలతో శ్రీరామ్

ఎల్‌బీనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సీఎంఏఎస్‌కు అనుబంధమైన అండర్ వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 21 వరకు రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని మహారాణా ప్రతాప్ ఖేల్ గావ్ స్విమ్మింగ్ పూల్‌లో ఏడో జాతీయ ఫిన్‌స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024 నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని అగాఖాన్ అకాడమీ బ్లూ డాల్ఫిన్ స్విమ్ క్లబ్‌కు చెందిన 11 ఏళ్ల కందుల శ్రీరామ్ ఏకంగా ఆరు పతకాలు కైవసం చేసుకున్నాడు. తొలి ప్రయత్నంలోనే అన్ని ఈవెంట్లలో శ్రీరామ్ పతకాలు సాధించడం గర్వకారణమని కోచ్ దినేష్ రాజోరియా, అగాఖాన్ అకాడమీకి చెందిన సురేంద్ర పేర్కొన్నారు.

అకారణంగా దూషించిన వ్యక్తికి జైలుశిక్ష



ఇస్మాయిల్(ఫైల్)

చంపాపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అకారణంగా ఓ కుటుంబాన్ని దూషించిన వ్యక్తికి నాంపల్లి కోర్టు జైలుశిక్ష విధించింది. కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీఎంనగర్‌కు చెందిన ఓ కుటుంబ సభ్యులను ఈ నెల 18న అదే ప్రాంతానికి చెందిన పండ్ల వ్యాపారి సయ్యద్ ఇస్మాయిల్ అలియాస్ షాబాజ్(25) అకారణంగా దూషిస్తూ బెదిరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం నాంపల్లి కోర్టు న్యాయమూర్తి ఎదుట ఇస్మాయిల్‌ను హాజరుపరచగా ఐదు రోజుల జైలు శిక్ష విధించారు.

ప్రభుత్వ పాఠశాలలో వనమహోత్సవం




వనమహోత్సవంలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట ప్రభుత్వ పాఠశాలలో తాజా మాజీ ఎంపీటీసీ చేగూరి వెంకటేష్ హెచ్‌ఎం ప్రసాద్‌తో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

- అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి

నేటి నుంచి ఛే నంబర్ వద్ద ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్ సిటీ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఛే నంబర్ వద్ద ఈనెల 24 నుంచి ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకూ వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్ట్ ఏవీఆర్..



ఏవీఆర్(ఫైల్)

వనస్థలిపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సీనియర్ జర్నలిస్ట్ ఎన్.వెంకటేశ్వర్‌రెడ్డి(ఏవీఆర్)(72) మంగళవారం మృతిచెందారు. వనస్థలిపురం ఫేజ్-4లో నివాసముండే వెంకటేశ్వర్‌రెడ్డి సుమారు 25 ఏళ్లుగా పలు దిన, వార పత్రికల్లో రిపోర్టర్‌గా పనిచేశారు. ఇటీవల కర్నూల్ జిల్లా నంద్యాలలో ఉన్న తన కూతురిని చూడడానికి వెళ్లిన ఏవీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హుటాహుటిన అతడిని వనస్థలిపురంలోని తన నివాసానికి తరలించారు. మంగళవారం తెల్లవారుజామున ఆయన తుదిశ్వాస విడిచారు. ఏవీఆర్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.